అసమ్మతి చల్లారిందా..?

◆ నేతలకు ఏమి హామీ లభించిందో..!

◆ అనంత, గుంతకల్లు నేతలు చంద్రబాబుతో సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టిక్కెట్టు ఖరారుపై టిడిపిలో అసమ్మతి చెలరేగిన విషయం తెలిసిందే. ఇందులో చాలా వరకు సర్దుబాటు చేసినా కొన్నింటిలోనూ కొనసాగుతూ వచ్చాయి. ప్రధానంగా అనంతపురం, గుంతకల్లు నియోజకవర్గాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదది, జితేందర్ గౌడ్‌లు అసంతృప్తితోనున్నారు. టిక్కెట్టు ఖరారవలేదన్న విషయం తెలిసిన వెంటనే రెండు నియోజకవర్గాలల్లో టిడిపి కార్యాలయాలపై దాడి చేసి ఫర్నీచర్లు ధ్వంసం చేశారు. అనంతరం కూడా నిరసనల పర్వం కొనసాగుతూ వచ్చింది. ఒకనొక దశలో స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారేమనన్నంతగా ప్రచారం నడిచింది. అయితే పార్టీని వీడబోమన్న విషయాన్ని మాత్రం ఆ ఇద్దరు నేతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రభాకర్ చౌదరి, జితేందర్ గౌడ్‌లను పిలిచి మాట్లాడారు. దీంతో వారు కొంత మెత్తబడినట్టు సన్నిహితులు చెబుతున్నారు. అయితే వారికి ఎటువంటి హామీ లభించిందన్నది చర్చ నడుస్తోంది. పార్టీ బాధ్యతలు ఈ నేతలకు అప్పగించినట్టు పార్టీలో చర్చ నడుస్తోంది. ప్రభాకర్ చౌదరికి రాయలసీమ బాధ్యతలు అప్పగించనున్నారని ప్రచారం నడుస్తోంది. జితేందర్ గౌడ్‌కు జిల్లా బాధ్యతలు అప్పగించే సూచనలున్నట్టు తెలుస్తోంది. ఈ హామీతోపాటు ఇంకేమైనా ఇచ్చారా అన్నది తెలియాల్సి ఉంది. నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంతోపాటు వచ్చే ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సూచించినట్టు తెలుస్తోంది. ఇద్దరు సీనియర్ నాయకులే కావడంతో వారి నియోజవర్గాల్లో మంచి పట్టున్న నేతలు కూడా. వీరు అభ్యర్థులతో కలిసి పనిచేస్తే పార్టీని సానుకూల పరిస్థితులే ఉండనున్నాయి. ఇదే రకమైన అసంతృప్తి ఉన్న శింగనమల నియోజకవర్గం నేతలతో ఇది వరకే చంద్రబాబు మాట్లాడారు. దీంతో శింగనమలలో వ్యతిరేకంగానున్న ఆలం నరసానాయుడు, కేశవరెడ్డిలు ఇప్పుడు మౌనంగా పనిచేసుకునిపోతున్నారు. దీంతో అసమ్మతి కనిపించడం లేదు. ఇక మడకశిరలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామికి మధ్య పడటం లేదు. ఈ నేపథ్యంలో అభ్యర్థిని మార్చాలని పట్టుబడుతున్నారు. ఇవి మినహా తక్కిన అన్ని చోట్లా కొంత వరకు పరిస్థితి మారినట్టుగానే కనిపిస్తున్నాయి. అసంతృప్తి తీవ్రంగా ఉన్న కళ్యాణదుర్గం, కదిరిల్లో ఇప్పటికే అసమ్మతి నేతలు పార్టీని వీడిపోయారు. వారు బయటకు పోవడంతో తక్కిన వారు పార్టీ కోసం పనిచేసే వారు ఉండిపోయారు. అనంతపురం, గుంతకల్లు అదినేత హామీతో సద్దుమణిగినట్టయింది. తక్కిన నియోజకవర్గాల్లో ఎక్కడా పెద్దగా అసంతృప్తులు ఇక కనిపించడం లేదు. ఇక సరిచేయాల్సింది మడకశిర నియోజకవర్గం ఒక్కటే పెండింగులో ఉంది.

ఓట్ల వేట..!



◆ నామినేషన్లకు ముందుగానే ముమ్మర ప్రచారాలు

◆ అభ్యర్థులే స్వయంగా కలుస్తూ ఓట్ల అభ్యర్థన

◆ కుటుంబం, బంధుగణం మొత్తం ప్రచారాల్లోనే..!

సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రధానమైన ప్రచారాలు వేడెక్కాయి. అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. నామినేషన్లు దాఖలు చేయకుండానే ఒక విడత ప్రచారం ముగించేలా ఓ స్థాయిలో ప్రచారాలు చేస్తున్నారు. అభ్యర్థుల కుటుంబం, బంధుగణం మొత్తం ప్రచారాల్లో నిమగ్నం అయ్యారు. గెలుపే లక్ష్యంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు.

ప్రజాశక్తి-అనంతపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ సారి ప్రధాన పార్టీలు ముందుగానే అభ్యర్థులను ప్రకటించేశాయి. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలకు సంబంధించి టిడిపి, వైసిపి అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ సైతం 11 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. దీంతో అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాలు చేస్తున్నారు. నామినేషన్లు వేసేందుకు ఇంకా 10 రోజుల సమయం ఉంది. ఆ లోపుగానే ఒక విడత ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నామినేషన్ల తంతు పూర్తవగానే ప్రచార వేడి మరింత వేగం పుంజుకోనుంది. ఓ ఒక్క ఓటరనూ వదలకుండా వారితో మాట్లాడుతున్న ఇళ్లు, పొలం అన్న తేడా లేకుండా ఎక్కడ జనం ఉంటే అక్కడికి నేతలు వాలిపోతున్నారు. తమను గెలిపించి ఆదరించాలంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోతో పాటు, స్థానికంగా నియోజకవర్గం, మండలం, ఆ గ్రామంలో చేసే అభివృద్ధిపై హామీలను గుప్పిస్తున్నారు.

ఓట్ల కోసం వ్యూహాలు

అభ్యర్థులు ఓట్ల కోసం వ్యూహాలు రచిస్తున్నారు. ముందస్తుగా వారు పర్యటించే గ్రామాలు, వార్డుల్లో ముఖ్యనేతలతో సమావేశం అవుతున్నారు. ఆ ప్రాంతంలో నిర్వహించే ప్రచారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? ఎవరితో మాట్లాడాలి.? మహిళా ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలని అన్న దానిపై మాట్లాడుకుంటున్నారు. దానికి అనుగుణంగా ఓ పద్ధతి ప్రకారం ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తమ పార్టీ మద్దతుదారుడు అయితే ఈ సారి సహకరించమని, ప్రత్యర్థి పార్టీ ఓటరయితే తాము అధికారంలో ఉండగా మీ కుటుంబానికి ఇంత మేలు చేశామని చెబుతున్నారు. ఇక ప్రతిపక్ష టిడిపి అభ్యర్థులు తాము అధికారంలోకి వస్తే మీకు అండగా ఉంటామని హామీని ఇస్తున్నారు. ముఖ్యంగా సూపర్-6 ద్వారా కలిగే ప్రయోజనాలను ఓటర్లకు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. వృద్ధుల వద్దకెళ్లినప్పుడు టిడిపి అధికారంలోకి వస్తే రూ.4 వేలు పింఛన్ ఇస్తామని, మహిళల వద్దకు వెళ్లినప్పుడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం తదితర వాగ్దానాల గురించి తెలియజేసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఉగాదిపై అభ్యర్థుల ప్రత్యేక దృష్టి

ఎన్నికల సీజన్‌లో ఉగాది పండుగ వచ్చింది. తొలిపండుగగా భావించే ఉగాదికి గ్రామాల్లో గ్రామీణులు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. పండుగ రోజు కావడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలు, ఉద్యోగ రిత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు స్వగ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో పండుగ మూడు రోజులను తమకు అనుకూలంగా మలుచుకుని ఓటర్లను కలుసుకోవాలని అభ్యర్థులు ప్రణాళికలు తయారు చేసుకున్నారు. ఇప్పటికే ఈ విషయంపై గ్రామస్థాయి నాయకులతో మాట్లాడారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడి పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ కలిసి ఓటు అడిగేలా అభ్యర్థులు పావులు కదుపుతున్నారు.

అనుకూల, ప్రతికూల ఓట్లపై లెక్కలు

గ్రామాలు, వార్డుల వారీగా అభ్యర్థులు ఇప్పటి నుంచే అనుకూల, ప్రతికూల ఓటర్లను గుర్తించే పనిలో పడ్డారు. అనుకూల ఓటర్ల కంటే ప్రత్యర్థికి వెళ్లే ఓట్లను తమకు అనుకూలంగా తిప్పుకోవడం కోసం అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నారు. ఒక కుటుంబాన్ని తమ వైపునకు తెచ్చుకుంటే ఆ ఇంట్లోని నాలుగు ఓట్లు తమకు వస్తాయన్న భావనతో వారిని బుజ్జగిస్తూ వ్యూహాత్మకంగా మందుకు సాగుతున్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు వ్యూహాత్మకంగా మందుకు సాగుతున్నారు.

జెఎన్‌టియుకు పూర్వవిద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 1963-68 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సి.చిరంజీవి అతని మిత్రులు జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల శిల్పాగర్ల్స్ హాస్టల్‌కు మంగళవారం నాడు స్టీమ్ కుకింగ్ కోసం నూతన స్టీమ్ బాయిలర్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీమ్ బాయిలర్‌ను 1963-1968 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందజేసినట్లు తెలియజేశారు. ఎల్లోరా హాస్టల్లోని స్టీమ్ కుకింగ్ బాయిలర్‌ను మరమ్మతు చేయిస్తామన్నారు. అనంతరం సి.చిరంజీవి విద్యార్థినులతో ముచ్చటించారు.

పండుగ పూటా పస్తులేనా..?

వేతనాల కోసం క్లాప్ కార్మికుల ఆందోళన

మామిడకాలు మెడలో వేసుకుని అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పండగ పూట కూడా కార్మికులు పస్తులు ఉండాల్సిందేనా అంటూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినూత్న రీతిలో మామిడాకులు మెడలో వేసుకొని ప్లేట్లు చేతిలో పట్టుకొని నిరసన వ్యక్తం చేసారు. మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, సిఐటియు పట్టణ కమిటీల కార్యద ర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలకు ముఖ్యమైన పండగ ఉగాది. అలాంటి పండుగ రోజు పస్తులు ఉంటున్న మున్సిపల్ కార్మికులు పారిశుధ్య, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులతో పాటు ప్రధానంగా కోవిడ్ , మలేరియా, గార్బేజ్ క్లాప్ ఆటో డ్రైవర్ల కార్మికులు తమ బాధను వ్యక్తం చేస్తూ మంగళవారం నగరంలోని మున్సిపల్ ఆఫీసు ముందు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు గతంలో రెడ్డి ఏజెన్సీ ద్వారా 8 నెలల వేతనాలు బకాయి ఉండడంతో వారు విధులను ఆపారు. ఇటీవల నూతనంగా వచ్చిన కమిషనర్ మేఘ స్వరూప్ క్లాప్ ఆటో డ్రైవర్లకు ఇకపై కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇస్తామని విధుల్లోకి తీసుకొని పని చేయిస్తున్నారు. మళ్లీ వేతనాలు పెండింగ్ పెట్టడంతో క్లాప్ ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ పిల్లలు కూడా పస్తు ఉండే పరిస్థితి ఏర్పడింది. మలేరియా కార్మికులకు ఈ నెలతో 4 నెలల వేతనాలు బకాయి ఉన్నాయి. వారు ఉన్నతాధికారులను వేతనాలు ఇవ్వాలని కోరగా డిసెంబర్ నెలకే మీ టెండర్ రద్దయిందని చెబుతున్నారు. డిసెంబర్ నెలకి టెండర్ రద్దు అయితే ఇప్పటివరకు ఎలా పని చేయించుకున్నారని సిఐటియు నాయకులు ఉన్నతాధికారులని ప్రశ్నించారు. కోవిడ్, మలేరియా గ్యారేజ్ కార్మికులకు కూడా 3 నెలల వేతనాలు బకాయి ఉన్నాయి. కార్మికుల వేతనాల విషయంలో నిర్లక్ష్యం వీడి పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కింది స్థాయి అధికారులను పలు దఫాలు హెచ్చరించినా ఫలితం లేదు. ఇప్పటివరకు ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులపై పారిశుధ్యం అధికారులు, పారిశుధ్యం అధికారులపై ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు ఉగాది పండగ చేసుకుంటూ పంచభక్ష పరమాన్నాలు తింటున్నారు. అనునిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికులు మాత్రం ఉగాది పండుగ రోజునా పస్తులు ఉండాల్సిందేనా అని సిఐటియు నాయకులు ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 48 వేల మంది పారిశుధ్య, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులను ఉగాది పండుగ రోజున పస్తులు ఉంచడం సబబు కాదని ప్రభుత్వం, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు కార్మికుల పక్షాన ఉండి రేపటి(బుధవారం) లోగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని లేకపోతే పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ప్రధానంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన 16 రోజుల సమ్మె పోరాటంలో భాగంగా పారిశుధ్య విభాగంలో 50 మందిని, ఇంజినీరింగ్ సెక్షన్‌లో 10మంది కార్మికులు తీసుకుంటామని, కోవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులకు రూ. 15వేల వేతనం ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. మున్సిపల్ ఆఫీస్ ఉన్నతాధికారులు చాలా వరకూ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని అలాంటి వారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెగ్యులర్ ఉద్యోగ కార్మిక సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ముత్తురాజు, ఎం.నల్లప్ప, ట్రెజరర్ నారాయణ స్వామి, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి స్వామి, సాకే తిరుమలేష్, జిల్లా కమిటీ సభ్యులు మంత్రి వరలక్ష్మి, శ్రీనివాస్‌మూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఫాదర్‌ఫెర్రర్

టిడిపి అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దగ్గుపాటి ప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ఎంతోమంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి ఫాదర్ ఫెర్రర్ అని టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ తెలిపార. ఫాదర్ ఫెర్రర్ 104వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫాదర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ స్పెయిన్ దేశంలో పుట్టి అనంత జిల్లాలో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ పేరుతో ప్రభుత్వానికి సమానంగా సేవలు అందించారని కొనియాడారు. యాభై ఏళ్ల ఆర్డీటీ సేవా ప్రస్థానం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వేలాది గ్రామాలకు విస్తరించిందన్నారు. విద్య, విజ్ఞానం, వైద్యం, శిక్షణ, ఉపాధి, అభివద్ధి రంగాల ద్వారా ఆర్డీటీ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతపురం పేరు ఉన్నంతవరకు ఆయన పేరు జిల్లాలో నిలిచే ఉంటుందని ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి, మాజీ కార్పొరేటర్ రాజారావు, టిడిపి నాయకులు గంగరామ్, ఎర్రగుంట సురేష్, రంగయ్య, మన్సూర్ పాల్గొన్నారు.

ఉగాది వేడుకలు

తెలుగుదేశం పార్టీ అనంతపురం అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ కార్యాలయంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌తో పాటు ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దగ్గుపాటి స్వయంగా ఉగాది పచ్చడి అందరికీ అందించారు. నూతన క్రోధి నామ తెలుగు సంవత్సరాదిలో అనంతపురం పార్లమెంట్, అర్బన్ నియోజకవర్గ ప్రజలు, టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలు, నాయకులకు అన్నీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచి రామలింగమ్మ

రాతిదూలం లాగుడు పోటీలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని శ్రీపురం గ్రామంలో మంగళవారం రాతిదూలం లాగుడు పోటీలు జరిగాయి. ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామ సర్పంచి యు.రామలింగమయ్య ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచి ప్రారంభించారు. పోటీల్లో ఏడు జతల వషభలు పాల్గొన్నాయి. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య వషభాలు మొదటి స్థానం, వెంకటస్వామి వషబాలు రెండో స్థానం, గోవిందు వషభాలు మూడో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.5,016, రెండో బహుమతి రూ.2016, మూడో బహుమతి రూ.1016 విజేతలకు సర్పంచి రామ లింగమయ్య అందజేశారు.

12న ఎమ్మెల్యే బాలకృష్ణ రోడ్‌షో

ప్రజాశక్తి-నార్పల



రోడ్‌షోకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ఈ నెల 12వ తేదీ హిందూపూరం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ రోడ్ షో శింగనమల నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో ఉంటుంది. అందులో భాగంగా మంగళవారం నార్పలలో శింగనమల నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ద్వి సభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి స్థల పరిశీలన చేశారు. అనంతరం శింగనమల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండల కేంద్రాల్లో కూడా స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ రోడ్ షో ఎక్కడ నిర్ణయించాలన్నది నేడు(బుధవారం) ఉదయానికి తెలుస్తుందని వారు తెలిపారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న గుమ్మనూరు ఈశ్వర్

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని ఖిల్లా జామియా మసీదులో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో గుంతకల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొన్నారు. ఆయన ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని కేసేపల్లి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు బండి నాగనంద(44) అప్పుల బాధ తాళలేక సోమవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.బషీర్‌అమ్మద్, రాష్ట్ర కమిటీ మెంబరు మాయకుంట్ల మోహన్, జిల్లా కమిటీ మెంబరు బి.చంద్రమౌళి మంగళవారం కేసేపల్లికి వచ్చి నాగనంద భార్య జ్యోతి, పిల్లలు శిరీష, చరణ్‌లను పరామర్శించారు. వారు మాట్లాడుతూ నాగానంద 20 ఏళ్లుగా సొంత మగ్గం కలిగి చేనేత వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. పట్టు ముడి సరుకుల ధర విపరీతంగా పెగడం, పవర్ లూమ్స్ మగ్గాల్లో విచ్చలవిడిగా చేనేత రకాల చీరలు తయారు చేయడం వల్ల, చేనేత మగ్గంపై నేసిన చిరాలకు గిట్టుబాటు ధర లేక, మరోవైపు పిల్లల చదువులకు తెచ్చిన అప్పులు తీర్చలేక తన ఇంట్లోనే ఉరి వేసుకొని మృతి చెందాడన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే మృతుని కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి పిల్లల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఎపి చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది

ఆత్మహత్య చేసుకున్న చేనేతకార్మికుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

ఎన్నికల్లో భాగస్వాములు కండి

కలెక్టర్ డా౹౹వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను చైతన్యం చేసేలా విద్యార్థులు, కార్టునిస్టులందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ డా౹౹వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలు డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్లు, ఉన్నత, కెజిబివి పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు, జెఎన్‌టియు, ఎస్‌కెయు, సెంట్రల్ యూనివర్సిటీల విద్యార్థులు, కార్టూనిస్టులు, డ్రాయింగ్, పెయింటింగ్ సంస్థలు ఎన్నికల మస్కెట్ రూపకల్పనలో పాలుపంచుకోవాలన్నారు. సాధారణ ఎన్నికలు - 2024 నేపథ్యంలో స్వీప్ యాక్టివిటీల్లో భాగంగా ఎన్నికల మస్కెట్ రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు ఈనెల 13వ తేదీ చివరి తేదీ అన్నారు. టాప్ 3 ఎంట్రీలను జిల్లా ఎన్నికల అధికారి వెబ్ సైట్‌లో ప్రదర్శించనున్నట్లు తెలియజేశారు. ఎంట్రీలను atpelectionmascot@gmail.com అనే ఈమెయిల్ ఐడికి పేరు, మొబైల్ నెంబర్, చిరునామాతో కూడిన వివరాలను నమోదు చేసి పంపాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు క్యాంపెయిన్- 2024 లో భాగంగా జిల్లా స్థాయి మూల్యాంకన కమిటీ ద్వారా ఎంపిక చేయబడిన ఎన్నికల మస్కెట్ రూపకర్తకు రూ.5 వేల నగదు బహుమతి ఇస్తామన్నారు. ఏదైనా సందేహం కోసం జిలాన్ మొబైల్ నంబర్ 9177101476 ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎన్నికల మస్కెట్ రూపకల్పనలో జిల్లా ప్రజలు, డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్లు, విద్యార్థులు పాలుపంచుకోవాలని సూచించారు.

ఎన్నికలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోండి : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

జిల్లాలో ఎన్నికలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నగర పోలీసులను ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎస్డీపీవో కార్యాలయంలో నగర పోలీసు అధికారులతో సమావేశమై ఎన్నికల వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్ధేశం చేశారు. ముందుగా నగర పోలీసు స్టేషన్ల పరిధిలోని భౌగోళిక స్థితిగతులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిస్థితులు, తదితరాలపై సమీక్ష చేశారు. ఆతర్వాత ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకపరిచినా, ఓటర్లను ప్రలోభపెట్టినా చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. రౌడీషీటర్లు, సమస్యలు సష్టించే వారిపై ప్రత్యేక నిఘా వేయాలన్నారు. ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలే పోలీసు లక్ష్యమనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. గొడవలు, అల్లర్ల జోలికెళితే చట్టపరంగా కఠిన చర్యలుంటాయని కౌన్సిలింగ్ ద్వారా వివరించాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టినా... తాయిలాల ఎర చూపి అక్రమాలకు పాల్పడాలనుకున్నా చర్యలు తప్పవని పేర్కొనాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అనంతపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి, నగర సిఐలు రెడ్డెప్ప, క్రాంతికుమార్, ధరణీకిశోర్, ప్రతాప్ రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దర్

పూజలు నిర్వహిస్తున్న టిడిపి అభ్యర్థి సురేంద్రబాబు

'అమిలినేని' ప్రజావేదిక వద్ద పంచాంగ శ్రవణం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని క్రోధి నామ సంవత్సర శుభారంభం రోజున టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ప్రజా వేదిక వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచాంగం చేపట్టారు. మంగళవారం వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఏడాది వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు సస్యశ్యామలంగా పండాలని వేద పండితులు ఆశీర్వదించారు. ప్రజలు శాంతి మార్గంలో అనుసరిస్తే అభివద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మోరేపల్లి మల్లికార్జున రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ రామ్మోహన్ చౌదరి, వై పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్లపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-నార్పల

స్థానిక గూగూడు రోడ్డులో పార్నపల్లి నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు సోమవారం సాయంత్రం అతివేగంగా వచ్చి గూగూడు రోడ్డులో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనంపై ఉన్న బేల్దారి నాగరాజును వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు నాగరాజును ఆసుపత్రికి తరలించారు. అయితే ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్ బస్సును ఆపకుండా వెళ్లడంపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు అతి వేగంగా వచ్చి అతడిని ఢీకొందని కనీసం అతడికి ఏమైందని చూడకుండా బస్సును ఆపకుండా వెళ్లిపోవడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే సంబంధిత బస్సు డ్రైవర్, కండక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వైసిపికి అండగా నిలుద్దాం

ప్రజాశక్తి-రాయదుర్గం

గుమ్మగట్ట మండలం పూలకుంట గ్రామంలో మంగళవారం నాడు వైసిపి నాయకులు వైజాగ్ రవి ఆధ్వర్యంలో క్రైస్తవుల ఆత్మీయ సమావేశం జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవులు, పాస్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సీఎం జగన్ చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో బాగున్నాయి. మళ్లీ రాష్ట్రానికి జగన్ సీఎం కావాలన్నారు. రాయదుర్గంలో మెట్టు గోవిందరెడ్డిని, అనంతపురం పార్లమెంట్ నుంచి శంకర్ నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ హరి, ఆనంద్. డానియేలు. సురేష్, జాన్ పాల్. వెంకటేశులు, బాబుతో పాటు గుమ్మగట్ట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

వైసీపీలో పలువురు చేరిక

వైసిపిలోకి చేరిన వారితో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైసీపీలోకి చేరారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన టిడిపి నాయకులు శివరాజు, అనిల్, లాల్ రాజు, వెంకటేష్, భీమలింగ, కుమార్, రామాంజనేయులు, మహేంద్ర, అజయ్, సురేష్ కుటుంబాలు వైసీపీలోకి చేరారు. ఎమ్మెల్యే వైవిఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి గెలుపునకు కషి చేస్తామని ఈ సందర్భంగా పార్టీలకు చేరిన వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కక్షలతో జీవితాలు నాశనం : డీఎస్పీ

ప్రజాశక్తి-పుట్లూరు

ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి కక్షల జోలికెళ్లకుండా గ్రామీణులు ప్రశాంతంగా జీవించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చింతకుంట, ఎల్లుట్ల గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండాలని. ఎన్నికల దష్ట్యా ఎవరి ఓటు వాళ్ళు స్వేచ్ఛగా వేసుకోవాలన్నారు. అలాకాకుండా గొడవలకు పాల్పడితే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హేమాద్రి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట శివారెడ్డి

ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచం హోమియో

నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

అవసరం వల్ల రోగికి స్వస్థత చేకూరాలే తప్ప మందుల దుష్ప్రభావంతో మరెన్నో కొత్త సమస్యలు రాకూడదు. అలా కొత్త సమస్యలు రాకుండా వ్యాధిని నయం చేసే పురాతన వైద్య విధానమే హోమియో చికిత్స. ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో అత్యుత్తమ మేధావి హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనేమూన్ హోమియోపతి వైద్య విధానాన్ని కనుగొన్న శాస్త్రవేత్త. ఆయన జయంతి రోజైనా ఏప్రిల్ 10వ తేదీన ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ క్రమంలో జిల్లాలో హోమియో వైద్య విధానానికి లభిస్తున్న ప్రజాధరణ ప్రభుత్వ ప్రోత్సాహం తదితరు అంశాలపై నేటి కథనం.

హోమియోను దేశీయ వైద్యంగా భావిస్తారు. దీర్ఘకాలిక వ్యాధులే కాదు కాలానుగుణంగా జబ్బులను సైతం నేటిగా నాణ్యతగా పనిచేసే వైద్యం ఇది. అల్లోపతి వైద్యంతో నయం కానీజబ్బుల సైతం హోమియోలో స్వస్థత చేకూరిందంటే అతిశయోక్తి కాదేమో. ఏటా సీజనల్‌గా జనాన్ని ముప్పతిప్పలు పెట్టే మెదడువాపు, స్వైన్ ఫ్లూ, డెంగీ, చికెన్ గునియా, చికెన్ ఫాక్స్, కండ్ల కలక, విష జ్వరాలు ఇలా ఎన్నో రకాల రోగాలు సోపకుండా హోమియో మందు ముందస్తు రక్షణ కల్పిస్తుంది. 1998లో జిల్లాను వణికించిన మెదడువాపు మహమ్మారిని అదుపు చేసింది హోమియో వైద్యమే. అప్పట్లో 20047 మంది చిన్నారులకు ఆ జబ్బు సోకింది. అలాంటి సమయంలో పసిపిల్లల ప్రాణాలకు రక్షణ కవచంలా హోమియోపతి నిలిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 25 ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి. ఇందులో 12 రెగ్యులర్ 13 జాతీయ ఆరోగ్య మిషన్ సారథ్యంలో నడుస్తున్న ఆసుపత్రులు ఉన్నాయి. అనంతపురం, గుత్తి, తాడపత్రి, పుట్టపర్తి, దావలం, గొల్ల మూతిమడుగు, రాయదుర్గం, బెలుగుప్ప తలుపుల, కళ్ళు మర్రి, బీకే సముద్రం, కుందుర్పి, కొనకొండ్ల, దేవనహళ్లి, కొత్తచెరువు, పెనుకొండ, ఎన్‌పి.కుంట, అమడకూరు, కదిరి, బేతేపల్లి, ఎద్దులపల్లి, కనేకల్, పట్నం, ఆత్మకూరులో హోమియో వైద్యశాలలు ఉన్నాయి.

హోమియో ఆసుపత్రి

హానికరం లేని వైద్యం

హోమియోపతి వైద్యం ప్రజల వైద్యం. తాత్కాలిక దీర్ఘకాలిక రోగాలను వంద శాతం నయం చేసే ఔషధ గుణం కలిగిన వైద్యమిది. అన్ని రకాల వ్యాధులకు హోమియోపతిలో మందులు ఉన్నాయి. హోమియో మందులను ఎటువంటి దుష్ప్రభావం లేకుండా ధైర్యంగా వాడొచ్చు. అల్లోపతి మందులు తింటూనే హోమియోపతి మందులు కూడా వాడవచ్చు. ప్రభుత్వం అన్ని రకాలుగా హోమియోపతి వైద్యశాలలో మందులను అందుబాటులో ఉంచింది.

డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు,
ప్రభుత్వ హోమియో వైద్యశాల, పాతూరు, అనంతపురం.

నార్పల బస్టాండ్‌లో నీడ, నీటి సమస్య

ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి-నార్పల

నార్పల బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు కనీసం నిలువ నీడ లేక తల్లడిల్లి పోతున్నారు. ఈ ప్రాంతం సుమారు 40 గ్రామాలకు ప్రధాన కేంద్రం. అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, పార్నపల్లి, తిమ్మంపల్లి, గూగూడు తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే నార్పలకు రావాల్సిందే. గత కొద్ది రోజుల నుండి ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటలకే సూర్యుడు భగభగ లాడుతూ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు బస్టాండులో నిలువనీడ లేక ఇబ్బందులకు గురవుతున్నారు. వద్ధులు, చిన్న పిల్లల, మహిళల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. నీటి వసతి కూడా లేదు. బస్సు కోసం వేచి ఉండి గొంతు తడారిపోతున్నా అలాగే ఉండాల్సిందే. మేజర్ పంచాయతీ అయిన నార్పలలో పరిస్థితి ఇలా ఉన్నా దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదు. నార్పల మెయిన్ బజార్ గూగూడు రోడ్డులో ఉన్న వ్యాపార సముదాయాల నుంచి ఒక్క దుకాణంకు రూ.4 నుంచి రూ.5వేల వరకు పంచాయతీ వారు పన్నుల రూపంలో వసూలు చేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు వస్తున్నా ప్రయాణికులకు నీడ, నీరు ఏర్పాటు చేసే పరిస్థితి కన్పించడం లేదు. దీంతో పాటు ఆర్టీసీకి నార్పల నుంచి తిరిగే వివిధ రూట్లలో ప్రయాణికుల ద్వారా ఆదాయం వస్తున్నప్పటికీ వారికి వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఇప్పటికైనా నార్పల బస్టాండ్ దుస్థితిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి నీడ, నీటి వసతి కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దగ్ధమైన పొగాకును పరిశీలించి, బాధిత రైతుతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

పొగాకు పంట దగ్ధం

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

మండల పరిధిలోని ఊరు చింతల గ్రామానికి చెందిన రైతు కష్ణయ్యకు చెందిన నాలుగు ఎకరాల పొగాకు పంట సోమవారం రాత్రి దగ్ధం అయ్యింది. ఆదివారం నాడు పంట కోసి పొగాకును ఎండబెట్టే క్రమంలో పొగాకు నిలువ చేసుకోవడానికి ఓ షెడ్డు ఏర్పాటు చేసుకుని అందులో నిలువ ఉంచాడు. ఈ క్రమంలో అదే రోజు రాత్రి రైతు కృష్ణయ్యకు చెందిన పొగాకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పొగాకు మొత్తం కాలిబూడిదైంది. ఒక్క రూపాయి కూడా చేతతికందకుండా రైతు నష్టపోయాడు.

రైతుసంఘం నాయకుల పరామర్శ

పొగాకు దగ్ధమైన బాధిత రైతు కృష్ణయ్యను రైతుసంఘం నాయకులు మంగళవారం పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం సంఘం నాయకులు రాజారామిరెడ్డి, జయశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి, గంగరాజు, పెద్దిరాజు పాల్గొన్నారు.

పిల్లలూ..ఎండలతో జాగ్రత్త..!

ప్రజాశక్తి-హిందూపురం

చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రు లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అందులోనూ వేసవి కాలం అంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి చిన్న పిల్లల వైద్యులు ఆఫ్తాబ్ సూచిస్తున్నారు. వేసవిలో చిన్న పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు ఆఫ్తాబ్ ప్రజాశక్తికి వెల్లడించిన వివరాలు..

పల్లెల్లో జాగ్రత్తలు

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. కాబట్టి ఫ్యాన్ వేసుకోవడం సాధ్యపడనప్పుడు కిటికీలు, తలుపులకు కర్టన్, తెరలు వేసుకోవడం ఉత్తమం. చల్లటి గాలిని ఇచ్చే కానుగ చెట్లకింద ఉండటం మంచిది. వేడి గాలులను ఇచ్చే చింత చెట్ల కింద బిడ్డలను ఉంచవద్దు.

6 నెలల కంటే పెద్ద పిల్లల విషయంలో..

ద్రవ పదార్థాలు తరుచూ తాగించాలి. జ్యూస్, కొబ్బరి నీళ్లు, సాధారణ నీరు తాగించాలి. పుచ్చకాయ (కళింగర), దోసపండ్లు, నీరు ఎక్కువగా ఉండే ఫలాలు ఇవ్వాలి.

సూర్యరశ్మి నుంచి రక్షణ

ఉదయం 8, 9 గంటల తర్వాత కిటికీలు మూసివేయలి. దీని వల్ల వేడి ఇంట్లోకి రాదు. నేరగా సూర్యరశ్మి ఇంట్లోకి రాకుండా చూసుకోవాలి. సాయం త్రం 5 గంటల పైన కిటికీలు తెరుచు కోవచ్చు.

చలువ అద్దాలు వేసుకోవాలి

ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేవారు టోపీ పెట్టకోవడం అవసరం. చలువ అద్దాలు ధరించడం మంచిది.

ఎండలో ఆడుకోవడంపై..

వాతావరణంలో వచ్చే మార్పుల ప్రభావం పిల్లలపై ఎంత తీవ్రంగా ఉంటుందో తెలియదు. ఎండ తీవ్రత వల్ల కలిగే ప్రమాదాన్ని వారికి ఓపిగ్గా వివరించాలి. వేసవి సెలవులకు ముందే ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి వడదెబ్బపై అవగాహన కల్పించాలి. ఉదయం 9 గంటల తర్వాత, సాయంత్రం 6 గంటల లోపు విద్యార్థులు ఎండలో ఆడుకోవడం తగదు. ఇండోర్ గేమ్స్ ఆడుకోవడం ఉత్తమం.

వడదెబ్బకు గురైతే..

వేసవిలో ఓఆర్ఎస్ అమృతం అని చెప్పాలి. ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా ఇచ్చే ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను ఒక లీటర్ నీటిలో కలుపుకోవాలి. బయట దొరికే ఓఆర్ఎస్ అయితే 200 మిల్లీలీటర్లతో కలపుకోవాలి. ఓఆర్ఎస్ ద్రవాన్ని అప్పుడప్పుడు బిడ్డలు, పెద్దలు తాగవచ్చు. దీని వల్ల శరీరంలో నుంచి పోయిన లవణాలు తిరిగి చేరుతాయి. కాళు పీకుతున్నట్లు అనిపించినా, కండరాల నొప్పిగా అనిపించినా ఓఆర్ఎస్ తాగడం అవసరం. వడదెబ్బకు గురైతే చెమట పట్టదు, వాంతులు, జ్వరం వస్తాయి. వాంతులు వస్తున్నప్పుడు ఓఆర్ఎస్‌ను కాఫీ లాగా కొంత తాగించాలి. లేదంటే అది కూడా వాంతి అయ్యే అవకాశం వుంది.

అనంత పెన్నిధి ఫాదర్ ఫెర్రర్

ప్రజాశక్తి-పామిడి

పట్టణంలోని పామిడమ్మ దేవాలయ ఆవరణలో మంగళవారం విశాల ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్‌డిటి(రాయలసీమ డెవలప్మెంట్ ట్రస్ట్) అధినేత విన్సెంట్ ఫెర్రర్ జయంతి సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల సమాఖ్య సభ్యులు మాట్లాడుతూ అనంతలో ఆర్‌డిటి సంస్థను ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకునేందుకు వచ్చిన పేదల పెన్నిధి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని కొనియాడారు. 1969వ సంవత్సరంలో అనంతపురం జిల్లాలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ఆర్‌డిటిని ఏర్పాటు చేశారన్నారు. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, వికలాంగులకు ఆర్‌డిటి ద్వారా ఆసరగా నిలిచారన్నారు. జిల్లా ప్రజలందరికీ విద్య, వైద్యం, ఇళ్లు అందించేందుకు ముందు కొచ్చారన్నారు. వ్యవసాయం, మహిళా సంఘాల అభివృద్ధి, క్రీడలను ప్రోత్సహించారన్నారు. ఆర్‌డిటి జిల్లాకు రావడం ఓవరం అన్నారు. ఆర్‌డిటిని స్థాపించి 54 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఫెర్రర్ వికలాంగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. వికలాంగులమైన మేము నేడు స్వచ్ఛందంగా సమాజంలో ఏదో ఒక పని చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామంటే అందుకు ఆర్‌డిటినే కారణమన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షుడు కేశవాచారి, వంకరాజుకాలువ నాగభూషణ, సర్వేష్, శివన్న, అప్పన్నగారి కుమార్, వంకరాజుకాలువ కేశవ, ఓం ప్రకాష్, ఆదిలక్ష్మి, నాగరత్నమ్మ, సిడి పాయింట్ మల్లి, మహబాషా, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : పేదల పెన్నిధి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను 10వ డివిజన్ ఫెర్రర్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ "ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న" అన్న మాట నేడు ఎంతోమందికి ఆశయంగా మారిందని తెలిపారు. రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఏర్పాటు చేసి రాయలసీమ జిల్లాలో ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా గహాలను నిర్మించి పేదల పెన్నిధి అయ్యారన్నారు. ఆర్థిక భారంతో చదువులను మధ్యలోనే ఆపేసే ఎంతోమంది పిల్లలకు ఆర్థిక సహకారాన్ని అందించి ఉన్నత చదువులకు బాటలు వేసిన మహానుభావులని కొనియాడారు. కరోనా కష్టకాలంలో ఆర్డీటీ సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ లింగమయ్య, దూదేకుల బాబా ఫక్రుద్దీన్, గోపాల్, మునవర్, విజయ్, పోతుల మంజునాథ్, స్వరూప్, పవన్, రామంజి, నారాయణస్వామి, మహబూబ్ బాషా, అల్లాబకాష్ పాల్గొన్నారు.

అనంతపురం 10వ వార్డులో ఫెర్రర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

వజ్రకరూరు : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని దళిత గిరిజన హక్కుల సాధన సమితి అధ్యక్షులు గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం నాడు ఉరవకొండ మండల పరిధిలోని లత్తవరం, ఉరవకొండలోని విటల్ రుక్మిణి వద్ధాశ్రమం, విడపనకల్లు మండల పరిధిలోనే పాల్తూరు గ్రామంలో ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫాదర్ ఫెదర్ 104వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు, సర్పంచి బ్యులారాణి రాజశేఖర్ ఆధ్వర్యంలో వేరువేరుగా ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు లత్తవరం చంద్రశేఖర్, కోనాపురం ఎర్రిస్వామి, ఉరవకొండ ఎల్లప్ప, ఆనంద్ కుమార్, ఆనంద్ రాజు, ఆర్డీటీ టీచర్ విజయ్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, చెన్నకేశవులు, రాయంపల్లి వెంకటేశులు, శివ, మల్లికార్జున, ఓబులేసు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాయనపల్లి క్రాస్‌లో చోరీ

రూ.5 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని నాయనపల్లి క్రాస్‌లో ఓ ఇంట్లో సోమవారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి బాధితులు పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... నాయనపల్లి క్రాస్‌లో కమలమ్మ అనే మహిళ నివాసం ఉంటోంది. సోమవారం రాత్రి ఆమె ఇంటిపై నిద్రించింది. ఈ సమయంలో దొంగలు ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉంచిన రూ.5 లక్షల నగదు, రూ.1.50 లక్షల విలువజేసే బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే ఇంట్లో చూడగా వస్తువులన్నీ చిందరవందరగా కన్పించాయి. దీంతో దొంగతనం జరిగినట్లు గురించి బాధితురాలు కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నార్పలలో మరోసారి రెచ్చిపోయిన దొంగలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రమైన నార్పలలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. స్థానిక ఎంపిడిఒ కార్యా లయ సమీపంలో ప్రసాద్, ఈశ్వరమ్మ దంపతులు దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి సమయంలో కొందరు దొంగలు దుకాణం తాళాలను పగలగొట్టి సిగరెట్ పెట్టెలు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారని బాధితులు వాపోయారు. దొంగలు రెండు రోజుల క్రితం ఓ సెల్‌ఫోన్ దుకాణం తాళాలు బద్దలు కొట్టి అందులో సామగ్రిని ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. అలాగే స్థానిక దిగుమర్రి రోడ్డులోని ఓ కిరాణా దుకాణం తాళాలు పగలగొట్టడంతో పాటు రెండు ఎరువుల గోడౌన్ల తాళాలను కూడా దొంగలు బద్దలు కొట్టారు. ఈ చోరీలకు సంబంధించి అనుమానితులను విచారణ చేస్తున్నామని, త్వరలోనే చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన ఆర్.నాగయ్య అనే వ్యక్తి లారీ క్లీనర్‌గా పని చేసేవాడు. ఈ నేపథ్యంలో రాయలచెరువు నుంచి గుంతకల్లుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా జక్కలచెరువు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వాహనం అదుపు తప్పి...

రొద్దం : పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో చెక్‌పోస్ట్ సమీపంలోని మసీదు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కుర్లపల్లి గ్రామానికి చెందిన దినేష్, అతని బంధువు నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కర్నాటకలోని కొడమడుగు గ్రామం నుంచి వారు ద్విచక్ర వాహనంపై కుర్లపల్లికి వెళ్తుండగా మండలంలోని ఆర్.మరువపల్లి, రొద్దం గ్రామాల మధ్య ఉన్న మసీదు వద్ద అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న వారిని ఆ సమయంలో పెనుకొండ వైపు నుంచి మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి వెళ్తున్న పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ గమనించి తన వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశకి-చిలమత్తూరు

మండల పరిధిలోని సోమగట్ట పంచాయతీలోని చెరువుకిందపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి గోతిలో పడ్డ ఘటనలో శ్రీనివాసులు(40) మృతి చెందినట్లు ఎస్ఐ గంగాదర్ తెలిపారు. మృతుడు కర్నాటకలోని బాగేపల్లి తాలూకా బద్రప్పపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా ఎస్ఐ తెలిపారు. అతడి భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగర ప్రజలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)కు ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5శాతం రాయితీ లభిస్తుందని కమిషనర్ మేఘస్వరూప్ ఓ ప్రకటనలో తెలియజేశారు. డిమాండ్ నోటీసుల కోసం వేచి చూడకుండా, అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద పన్ను చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. ఇప్పటికే 2024-25 డిమాండ్ మొత్తం ఆన్‌లైన్‌లో పొందుపరిచామన్నారు. ఆస్తి, ఖాళీ స్థల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెలాఖరులోపు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలన్నారు. పన్ను చెల్లింపులు కోసం నగరపాలక సంస్థలో ప్రత్యేక కౌంటర్లను ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు సెలవు రోజుల్లో కూడా అందుబాటులో ఉంటాయన్నారు. అదనపు క్యాష్ కౌంటర్లు, వేణుగోపాల్ నగర, రాజా హంస గెస్ట్ హౌస్ పక్కన ఉన్న 01 వ వార్డు సచివాలయం, వినాయక నగర్ నందు 03వ వార్డు సచివాలయం, ఆశోక్ నగర్, హరి హర గుడి ప్రక్కన ఉన్న 39 వ వార్డు సచివాలయం, నవోదయ కాలనీ ఆటో స్టాండ్ పక్కన గల 40,41 వ వార్డు సచివాలయం, రామ్ నగర్ మీసేవ పక్కన ఉన్న 54వ వార్డు సచివాలయం మరియు రెండవ రోడ్డు లోని స్టడీ పార్క్ ప్రక్కన ఉన్న 64 వ వార్డు సచివాలయము నందు చెల్లించవచ్చున్నారు. పన్నులను ఆన్-లైన్ ద్వారా చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

పల్లెల్లో కనిపించని ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-పుట్లూరు

గత సంవత్సరం నుంచి మండలంలో వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. బోర్లలో చుక్క నీరు రాకపోవడంతో రైతులు పంటలు చేతికందకుండా పోయాయి. పెట్టుబడులు సైతం చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామాల్లో ఉగాది పండుగ సంబరాలు కన్పించడం లేదు. పిండి వంటలు కూడా చేసుకోకుంటే సాధారణంగానో రోజును గడిపేశారు.

తెలుగుదేశాన్ని ఆదరించండి బండారు శ్రావణి శ్రీ

ప్రజాశక్తి-గార్లదిన్నె

రానున్న సార్వత్రిక ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని శింగనమల నియోజకవర్గం కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఓటర్లను కోరారు. మంగళవారం మండలంలోని కనంపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తెలుగుదేశం "బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ", "సూపర్ సిక్స్" పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ పాండు, మాజీ జెడ్పిటిసి గుర్రం ఆదినారాయణ, చల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ